ఉద్యమకారుల పాదయాత్ర పోస్టర్‌ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ ఈటల

మేడ్చల్‌: రాష్ట్రంలో తెలంగాణ ఉద్యకారుల ఆధ్వర్యంలో నిర్వహించనున్న పాదయాత్ర వాల్‌ పోస్టర్‌ను మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ బుధవారం పూడూర్‌ లోని తన నివాసంలో ఆవిష్కరించారు. 'ఉద్యమకారుల పాదయాత్రకు ఊరూరా స్వాగతం పలకండి' అనే నినాదంతో ఈనెల 15 న కొత్తగూడెం నుంచి రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేయనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఉద్యకారులతో కలిసి ఆవిష్కరించారు. ఉద్యమ కారులు తమ పాదయాత్రతో ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ



ధాన్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా మేనేజర్‌ సుగుణబాయి

ఘట్‌కేసర్‌: ఎదులాబాద్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్‌ సుగుణబాయి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ధాన్యాన్ని పరిశీలించారు. ధాన్యంలో తేమ లేకుండా ఆరబెట్టాలని, తాలు, దుమ్ము లేకుండా తూర్పార బట్టాలని సూచించారు. గన్నీ బ్యాగులతో పాటు కొనుగోలు కేంద్రంలో రైతులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బాసిత్‌, ఏఈఓ రాజ్‌కుమార్‌, కేంద్రం బాధ్యుడు ప్రవీణ్‌రెడ్డి, ఎఫ్‌ఎస్‌సీఎస్‌ డైరెక్టర్‌ ఉదయ్‌కుమార్‌రెడ్డి, రైతులు నరేశ్‌, ఆంజనేయులు, సత్తయ్య, నర్సింహ్మా, శివకుమార్‌, సురేశ్‌, వెంకటేశ్‌ పాల్గొన్నారు.

మల్లారెడ్డి ఫార్మసీ కళాశాలలో రక్తదాన శిబిరం



రక్త దానం చేస్తున్న విద్యార్థులు

మేడ్చల్‌: మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. విద్యార్థులు, ఫ్యాకల్టీలు తదితరులు రక్తదానం చేశారు. ఎన్‌ఎస్‌ఎస్‌, రెడ్‌క్రాస్‌ సొసైటీ సౌజన్యంతో రక్తదాన శిబిరం నిర్వహించినట్లు నిర్వహకులు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ తుల్జారాణి,తదితరులు పాల్గొన్నారు.

పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలు

శామీర్‌పేట్‌: శ్రీ మద్విరాట్‌ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన మూడుచింతపల్లిలోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో స్వామి వారి 332 వ ఆరాధనోత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్‌ మహంకాళి ఆంజనేయులు చారీ, మండల విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు బాలకృష్ణ, ఉపాధ్యక్షుడు విష్ణు చారీ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఈటల ఇంట్లో చిన జీయర్‌ స్వామి పూజలు



మేడ్చల్‌: త్రిదండి చిన జీయర్‌ స్వామి బుధవారం మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ నివాసంలో పూజలు నిర్వహించి ఈటల కుటుంబ సభ్యులను ఆశీర్వదించారు. మేడ్చల్‌ మున్సిపాలిటీ పరిధిలోని పూడూర్‌లోని ఈటల ఇంటికి వచ్చిన చిన జీయర్‌ స్వామీజీకి ఎంపీతో ఆయన కుటుంబ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు .పూజల అనంతరం జీయర్‌ స్వామీ ఆశీర్వచనాలు ఇచ్చారు.

అనుమతి లేని ఆసుపత్రులు..

అడ్డగోలు వసూళ్లు..

ప్రజల నుంచి ఫిర్యాదుల వెల్లువ

- మొక్కుబడి తనిఖీలతో కాలం వెళ్లదీస్తున్న వైద్యశాఖ
- కొన్నింటిపై ఉదాసీనత
- ఇష్టారీతిన ఫీజుల వసూళ్లు
- రోగులకు తప్పని తిప్పలు



అనుమతులు లేని ఆసుపత్రులకు నోటీసులు అందజేస్తున్న వైద్యారోగ్య శాఖ అధికారులు (ఫైల్‌)

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ అనుమతి లేని ప్రైవేటు ఆసుపత్రులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఒక ఆసుపత్రికి అనుమతి తీసుకుని రెండు, మూడు బ్రాంచ్‌లు తెరుస్తున్నారు. వాటిపై ఎలాంటి తనిఖీలు, విచారణ లేకుండానే వైద్యారోగ్య శాఖ అనుమతులు మంజూరు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మెడికల్‌ షాపునకు కన్సల్టెంట్‌ క్లినిక్‌ పేరిట కూడా ఆసుపత్రులు ఏర్పాటు చేస్తుండటం గమనార్హం. అవసరం లేకున్నా వైద్య పరీక్షలు చేస్తూ.. పేదల రక్తం పీల్చుతున్నారు. రోగుల నుంచి అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్‌ ఆసుపత్రులు, డయాగ్నోస్టిక్‌ సెంటర్లు, అల్ట్రా సౌండ్‌ సెంటర్లపై వైద్య ఆరోగ్య శాఖకు పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నా పట్టించుకోవడం లేదని రోగులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించిన ప్రైవేట్‌, కార్పొరేట్‌ ఆస్పత్రులు ,డయాగ్నోస్టిక్‌ సెంటర్లపై చర్యలు చేపట్టాల్సిన జిల్లా వైద్యారోగ్యశాఖ మొక్కుబడి తనిఖీలతో కాలం వెళ్ల దీస్తుందన్న ఆరోపణలు ఉన్నాయి.

నిబంధనలు ఇలా..

అల్లోపతి ప్రైవేటు మెడికల్‌ కేర్‌ ఎస్టాబ్లిష్‌మెంట్‌ యాక్ట్‌ ప్రకారం ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్‌ సెంటర్లు, కన్సల్టెంట్‌ క్లినిక్‌లు, ఆయుష్‌ క్లినిక్‌లు, ఫిజియోథెరపి కేంద్రాలకు అనుమతి తప్పనిసరి. నిబంధనల ప్రకారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో దరఖాస్తు చేసుకోవాలి. అలా దరఖాస్తు చేసుకున్న ఆసుపత్రి, క్లినిక్‌. డయాగ్నస్టిక్‌ కేంద్రాల నిర్వాహకులు అందులో పనిచేసే వైద్యుల రిజిస్ట్రేషన్‌ తప్పనిసరిగా ఉండాలి. అగ్నిమాపక, బయో వేస్ట్‌మేనేజ్‌మెంట్‌, పొల్యూషన్‌, మున్సిపల్‌ ట్రేడ్‌ లైసెన్స్‌తో సహా అన్ని రకాల పత్రాలు సరిగా ఉన్నప్పుడే ఆసుపత్రుల ఏర్పాటుకు అనుమతి ఇవ్వాల్సి ఉంది.

ప్రత్యేక బృందాలతో దందా..

రాష్ట్ర ప్రాంతీయ విజిలెన్స్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డైరెక్టరేట్‌ ఆదేశాల మేరకు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు జిల్లాలో ఇప్పటి వరకు దాదాపు 40 హెల్త్‌ కేర్‌ అండ్‌ పాలీ క్లినిక్‌లు, ఫస్ట్‌ ఎయిడ్‌ క్లినిక్‌, డయాగ్నోస్టిక్‌ సెంటర్లు, అల్ట్రా సౌండ్‌ కేంద్రాలు, ల్యాబ్‌లను తనిఖీ చేసి అర్హతలేని వైద్యులు, సిబ్బందితో వాటిని నిర్వహిస్తున్నట్లు గుర్తించి సీజ్‌ చేశారు. అయినా కొన్ని నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. ఆయా ఆసుపత్రుల రిజిస్ట్రేషన్‌, అనుమతులు తదితర అంశాలపై ప్రత్యేక బృందంతో ఆరా తీస్తున్న వైద్యారోగ్యశాఖ మామూళ్ల దందాకు తెరలేపినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అనుమతిలేని ఆసుపత్రులు 995 పైనే..

జిల్లాలో దాదాపు 3,835 పైగా ప్రైవేట్‌, కార్పొరేట్‌ ఆసుపత్రులు ఉండగా, ఇందులో అన్ని రకాల అనుమతులతో కొనసాగుతున్న ఆసుపత్రులు 2,840 మాత్రమే ఉన్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ పేర్కొంటోంది. ఎలాంటి అనుమతి లేని ప్రైవేట్‌ ఆసుపత్రులు 995 పైగా ఉన్నట్లు వైద్యా ఆరోగ్యశాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అనుమతులు ఉన్న ఆసుపత్రుల్లో వంద కంటే ఎక్కువ పడకలు(బెడ్స్‌) ఉన్న ప్రైవేట్‌ ఆస్పత్రులు 58 ఉండగా, 20 నుంచి 100 పడకలు(బెడ్స్‌) ఉన్న ఆస్పత్రులు 417 ఉన్నాయి. 20 పడకలు (బెడ్స్‌) ఉన్న ఆస్పత్రులు 594 ఉన్నాయి. అలాగే 1012 పాలీక్లినిక్‌లు, క్లినిక్‌లు, డయాగ్నోస్టిక్‌ సెంటర్లు 280, డెంటల్‌ ఆస్పత్రులు 66, ఫిజియోథెరపీ సెంటర్లు, 10 రిహాబిలిటేషన్‌ సెంటర్లు, అనుమతి పొందిన స్కానింగ్‌ సెంటర్లు 628 ఉన్నాయి. ఎలాంటి అనుమతి లేని స్కానింగ్‌ సెంటర్లు 500పైగా ఉన్నట్లు అంచనా.

ఫిర్యాదు వస్తేనే తనిఖీ చేస్తాం



అనుమతి లేని ఆసుపత్రులు, క్లినిక్‌లు, డయాగ్నోస్టిక్‌, స్కానింగ్‌ సెంటర్లు, అధిక ఫీజుల వసూళ్లు తదితర అంశాలపై ఫిర్యాదులు అందితేనే తనిఖీలు నిర్వహిస్తున్నాం. జిల్లాలో ఇప్పటి వరకు దాదాపు 40 ప్రైవేట్‌ ఆసుపత్రులు, క్లినిక్‌లు, వివిధ సెంటర్లను సీజ్‌ చేశాం . రెండు ఆసుపత్రులకు రూ.5 లక్షల జరిమానా విధించాం. పదుల సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయి. సమయాభావం వల్ల సకాలంలో తనిఖీలు చేపట్టలేకపోతున్నాం.

–డాక్టర్‌.ఉమాగౌరీ, డీఎంహెచ్‌ఓ ,మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా

మల్లారెడ్డి కళాశాలలో డ్రోన్‌ వర్క్‌ షాప్‌



డ్రోన్‌ ను పరిశీలిస్తున్న మల్లారెడ్డి కళాశాల విద్యార్థులు

మేడ్చల్‌: మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజినీరింగ్‌ కళాశాలలో బుధవారం డ్రోన్‌ వర్క్‌ షాప్‌ నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించిన వర్క్‌ షాప్‌ బుధవారం ముగిసింది. వివిధ సంస్థల ప్రతినిధులు విద్యార్థులకు డ్రోన్‌లపై అవగాహన కల్పించారు. డ్రోన్‌లు వ్యవసాయం, పర్యవేక్షణ, రవాణా తదితర రంగాల్లో ఎలా ఉపయోగపడుతున్నాయో వివరించారు. బీఎల్‌డీసీ మోటార్‌, ప్రొపెల్లాఆర్‌, ఫైలెట్‌ కంట్రోల్స్‌, లిథియం బ్యాటరీ టెక్నాలజీ, వంటి అంశాలపై విద్యార్థులకు పూర్తి స్థాయి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్‌జె సాఫ్ట్‌ టెక్నాలజీ సంస్థ ప్రతినిధులు శివప్రకాష్‌, సమీర్‌ విద్యార్థులు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ అశోక్‌, హెచ్‌ఓడీ డాక్టర్‌ సంపత్‌ కుమార్‌,కో ఆర్డినేటర్లు మాల్యాద్రి, రామకృష్ణ, నిహర్‌, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా కన్యకా పరమేశ్వరి జయంతి



వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు



కుంకుమార్చన చేస్తున్న మహిళలు

జవహర్‌నగర్‌: జవహర్‌నగర్‌ కార్పొరేషన్‌ అంబేద్కర్‌నగర్‌ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు నంగునూరి అశోక్‌ ఆధ్వర్యంలో బుధవారం వాసవీ కన్యకా పరమేశ్వరీ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా ఆర్య వైశ్య మహా సభ కార్యనిర్వాహక అధ్యక్షుడు బల్లి శ్రీనివాస్‌ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల ఆత్మగౌరవాన్ని చాటిన కలియుగ పార్వతీదేవిగా వాసవీ అమ్మవారు నిలుస్తారన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. కార్యక్రమంలో శ్రీధర్‌, మురళీ, సతీష్‌, రాజేందర్‌, మల్లేశం, వెంకటేష్‌, రమేష్‌, చందు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి ఆలయంలో..

మేడ్చల్‌: స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం వాసవి మాత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వాసవీ క్లబ్‌, వైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయం ప్రాంగణంలో వాసవీ మాత విగ్రహాన్ని ఏర్పాటు చేసి కుంకుమార్చన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం .పంచామృతాలు, గంగ కళశాలలను వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళల కోలాటం ఆకట్టుకుంది. కార్యక్రమంలో అయ్యప్ప ఆలయ గురుస్వామి రాజేశ్వరగుప్తా, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రవన్‌కుమార్‌గుప్తా, నాయకులు చంద్రకాంత్‌, వెంకటేష్‌గుప్తా, శ్రీనివాస్‌గుప్తా, కృష్ణమూర్తి, శ్రీధర్‌, సంగీత, సవిత,సునీత తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

అల్వాల్‌: కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని వెంకటాపురం డివిజన్‌ టెలికాం కాలనీవాసులు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌ రెడ్డిని కోరారు. బుధవారం ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీ పార్కులో ఏర్పాటు చేస్తున్న మౌలిక వసతుల్లో భాగంగా గది నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాలనీ ప్రతినిధులు కుముదాదేవి, పిల్లి సంజయ్‌కిరణ్‌, జగన్నాథ్‌రెడ్డి, డీఎస్‌ రావు, బర్మాచారి, ఎంబీసీ మాజీ చైర్మన్‌ నందికంటి శ్రీధర్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు ఎల్‌. సురేష్‌ తదితరులున్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

కీసర: భూ భారతి పైలెట్‌ ప్రాజెక్టు కింద చేపట్టిన రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కీసర ఆర్డీఓ ఉపేందర్‌ రెడ్డి అన్నారు. భూ భారతిలో భాగంగా బుధవారం కీసర మండలం చీర్యాల గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి, కీసర తహసీల్దార్‌ అశోక్‌కుమార్‌ మాట్లాడుతూ.. గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కీసరలో 243, చీర్యాలలో 107, మొత్తంగా 350 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, గ్రామాల రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

భారత జవాన్లకు మద్దతుగా నినాదాలు

పోచారం: పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత్‌ సైన్యం దాడి చేయడాన్ని హర్షిస్తూ అన్నోజిగూడలోని హైటెవర్‌ వద్ద మాజీ చైర్మన్‌ కొండల్‌రెడ్డి ఆధ్వర్యంలో పటాకులు కాల్చారు. సంతోషంతో నినాదాలు చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు శేఖర్‌ ముదిరాజ్‌, జితేందర్‌, రాజేశ్వర్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్‌, ప్రశాంత్‌, రవి నాయక్‌, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.



పటాకులు కాలుస్తున్న నాయకులు

రైతులకు మద్దతు ధర కల్పించాలి



అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్‌: అధికారుల నిర్లక్ష్యం కారణంగా అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోతుందని, అధికారులు స్పందించి అన్నదాతలకు మద్దతు ధర చెల్లించాలని మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఎదులాబాద్‌ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేయకుండా దళారులకు మేలు జరిగేలా వారికే అమ్ముకునేలా అధికారులు ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు. రైతుసమస్యలపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే అన్నదాతలు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్‌ చేశారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా నరేందర్‌ గౌడ్‌

శామీర్‌పేట్‌: మేడ్చల్‌ జిల్లా, మూడుచింతలపల్లి మండల బీజేపీ అధ్యక్షుడిగా కేశవరం గ్రామానికి చెందిన తప్పెట్ల నరేందర్‌ గౌడ్‌ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నరేందర్‌గౌడ్‌ మాట్లాడుతూ... మండలంలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తనపై విశ్వాసంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌ రెడ్డితో పాటు పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



శ్రీను (ఫైల్‌)

ఘట్‌కేసర్‌: పనికి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన ఘట్‌కేసర్‌ పీఎస్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ పరశురాం కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఘట్‌కేసర్‌ బాలాజీనగర్‌కు చెందిన శ్రీను (55) వెల్డర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 2న పనికి వెళ్లిన అతను ఇంటికి తిరిగి రాలేదు. అతడికి ఫోన్‌ స్విచ్ఛాఫ్‌ వస్తుంది. అతడి కోసం గాలించినా ఆచూకీ లభించలేదు. అతడి కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాన్నారు.

వైభవంగా నిమిషాంబదేవి అవతరణోత్సవాలు



బోడుప్పల్‌: పెంటారెడ్డి కాలనీలోని నిమిషాంబదేవి అవతరణ మహోత్సవ వేడుకలను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్‌ కామరౌతు వినోద్‌కుమార్‌ మాట్లాడుతూ.. ఉదయం 5 గంటలకు పంచామృత, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, విశేష అలంకరణ, పంచహారతి, నీరాజనం, మంత్ర పుష్పం, 9 గంటలకు సామూహిక చండీహోమం, 10 గంటల నుంచి మహిళలచే సామూహిక కుంకుమార్చనలు, 12 గంటలకు అన్నప్రసాదం, భోజన కార్యక్రమాలు నిర్వహించినట్లు వివరించారు. ప్రధాన కార్యదర్శులు అశోక్‌కుమార్‌, శ్రీనివాస్‌, కోశాధికారి రమేష్‌, రాష్ట్ర నకాష్‌ సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రావు, ఆలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖర్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.

మేడ్చల్‌ మార్కెట్‌లో చోరీ

మేడ్చల్‌: మేడ్చల్‌ ప్రధాన మార్కెట్‌లోని రెండు దుకాణాల్లో దొంగలు చోరీలకు పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు మార్కెట్‌లోని మనీష్‌ ట్రేడర్స్‌, అగర్వాల్‌ ట్రేడర్స్‌ షాపుల షెట్టర్లు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. ఒకదాని తర్వాత మరో షాపులోకి చొరబడి కౌంటర్‌లలో ఉన్న నగదు ఎత్తుకెళ్లారు.మనీష్‌ ట్రేడర్స్‌ లో రూ.35 వేలు, అగర్వాల్‌ ట్రేడర్స్‌లో రూ.2 లక్షలు చోరీకి గురైనట్లు నిర్వాహకులు తెలిపారు. దీనిపై సమాచారం అందడంతో మేడ్చల్‌ ఏసీపీ శ్రీనివాస్‌ రెడ్డి, ఇన్‌స్పెక్టర్‌ సత్యనారాయణ, డీఐ సుధీర్‌ కృష్ణ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మేడ్చల్‌ పోలీసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కుర్మ సంఘం అధ్యక్షుడిగా లింగం కురుమ



నూతన కార్యవర్గ సభ్యులు

ఘట్‌కేసర్‌: ఘట్‌కేసర్‌ కుర్మ సంఘం అధ్యక్షుడిగా దయ్యాల లింగంకురుమ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం పట్టణంలోని మైసమ్మ గుట్ట ఆలయ సమీపంలో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా మహేశ్‌కురుమ, వెంకటేశ్‌కురుమ, ప్రధాన కార్యదర్శిగా సతీశ్‌కురుమ, సహాయ కార్యదర్శులుగా కరుణాకర్‌ కురుమ, పరశురాంకురుమ, కోశాధికారిగా రమేశ్‌ కురుమ, కార్యవర్గ సభ్యులు డి నర్సింహ్మా, కిశోర్‌, సుధాకర్‌, నవీన్‌, మహేశ్‌, సలహాదారులుగా శ్రీశైలం, గట్టయ్య, శంకర్‌, నర్సింహ్మా, అంజయ్య, కుమార్‌, గణపతి, భరత్‌లను ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షుడిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

అభివృద్ధి పనుల పరిశీలన



గౌతంనగర్‌: డివిజన్‌ పరిధిలోని న్యూ వేంకటేశ్వరనగర్‌లో రూ.10 లక్షలతో నిర్మిస్తున్న అభివృద్ధి పనులను బుధవారం కార్పొరేటర్‌ మేకల సునీతారాముయాదవ్‌ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రణాళికాబద్ధంగా నెరవేర్చుతానన్నారు. ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని చెప్పారు. నాయకులు మేకల రాముయాదవ్‌, బీఆర్‌ఎస్‌ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఊరెళ్లి వచ్చేసరికి ఇల్లు గుల్ల

ఘట్‌కేసర్‌: ఊరికి వెళ్లి వచ్చేసరికి ఇంట్లో దొంగలు పడి దోచుకెళ్లిన సంఘటన ఘట్‌కేసర్‌ పీఎస్‌ పరిధిలో చోటు చేసుకుంది. డీఐ శ్రీనివాస్‌ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక మేడపాటి నగర్‌కు చెందిన పూల సురేందర్‌రెడ్డి ఈ నెల 5న కుటుంబ సభ్యులతో కలిసి భువనగిరి సమీపంలోని సొంతూరికి వెళ్లాడు. బుధవారం ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా అల్మారాలోని వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. అల్మారాలో ఉన్న తులం బంగారం, మూడు తులాల వెండి చోరీకి గురైనట్లు గుర్తించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆధారాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.